


భ్రామరీకి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా పల్లకీలో ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



దిగొచ్చిన వంట నూనె!

మొన్నటి వరకు ఆకాశన్నంటిన వంట నూనెల ధరలు ఇప్పుడు దిగొస్తున్నాయి. ఆరు నెలల క్రితం రూ.200 వరకు పలికిన లీటర్ నూనె ధర ప్రస్తుతం రూ. 120 దిగువకు చేరింది.

8లో▸

గుడ్ ఈవినింగ్ డాక్టర్!

పెద్దాసుపత్రిలో సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభం

- రాయలసీమతో పాటు తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు ఈ ఆసుపత్రే పెద్దదిక్కు
- రోజూ దాదాపు 2,500 మంది రోగులకు ఓపీ సేవలు
- మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఓపీతో రోగులకు సౌకర్యం
- వైద్యపరీక్షల నివేదికలు సాయంత్రం వేళ పరిశీలన
- గతంలో రిపోర్టులు అందక మరుసటి రోజు లేక వారం వరకు నిరీక్షణ
- ప్రభుత్వ నిర్ణయంతో మెరుగైన వైద్యం

రోగులకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో సాయంత్రం ఓపీని ప్రారంభించింది. దీనివల్ల ఉదయం ఓపీలో చికిత్స చేయించుకున్న రోగి పరీక్షలను సాయంత్రం ఓపీలో చూపించుకుని ఇంటికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతోంది. గతంలో ఉదయం ఓపీలో చూపించుకోగా పరీక్షలు చేయించుకుని వచ్చే సరికి సంబంధిత వైద్యులు ఉండని పరిస్థితి. ఈ కారణంగా మళ్లీ వారం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోగికి అదే రోజు వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాయంత్రం ఓపీ సేవలకు శ్రీకారం చుట్టడం విశేషం.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

సేవలు చాలా సౌకర్యం



నా భార్యకు కాలులో సమస్య ఉండటంతో ఉదయం ఓపీకి వచ్చాను. వైద్యులు ఎక్స్‌రేతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్ష రాశారు. ఈ పరీక్షలు పూర్తయ్యేలోగా 2 గంటలు అయ్యింది. వైద్యులు 3 గంటల ఓపీకి రావడంతో వారికి చూపించుకుని వెళ్తున్నాం. గతంలో అయితే మళ్లీ రెండు, మూడు రోజులకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఏ రోజు పరీక్షలు అదే రోజే చూడటం బాగుంది.

– నౌషాద్, స్టాంటన్‌పురం, కర్నూలు

ఈ విధానం ఎంతో బాగుంది



ఈ ఆసుపత్రికి మా ఊరు వంద కిలోమీటర్ల పైగానే దూరం ఉంటుంది. ఉదయం బస్సులో బయలుదేరి ఆసుపత్రికి వచ్చేలోగా మధ్యాహ్నం 1 గంట దాటింది. దీంతో కాసేపు వేచి ఉండి 3 గంటలకు డాక్టర్లు రావడంతో ఉండి చికిత్స చేయించుకున్నాను. వైద్యులు ఓపికగా చూసి చికిత్స చేసి మందులు రాసిచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మా లాంటి వారికి ఈ విధానం ఎంతో బాగుంది.

– అశోక్, సోమలగూడూరు, నందవరం

సాయంత్రం ఓపీ వల్ల ఉపయోగాలు

- దూరప్రాంత వాసులు మళ్లీ మళ్లీ రాకుండా వచ్చిన రోజే చికిత్స అందుకునే అవకాశం.
- ఉదయం ఓపీ సమయం ముగిసినా తిరిగి సాయంత్రం వరకు ఉండి వైద్యులను కలిసి చికిత్స చేయించుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.
- దీర్ఘకాలిక వ్యాధుల రోగుల వైద్యపరీక్షల నివేదికలను అదే రోజే వైద్యులు చూసే వెసలుబాటు కలుగుతోంది.
- ల్యాబోరేటరీలు, ఫార్మసిలలోనూ రద్దీ తగ్గుతోంది.
- గతంలో ఉదయం ఓపీ తర్వాత క్యాజువాలిటిలో రద్దీ పెరిగేది. ఇప్పుడు మధ్యాహ్నం సైతం వైద్యులు ఓపీలో ఉండటంతో క్యాజువాలిటిలో రద్దీ ఉండటం లేదు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఓపీ టికెట్లు ఇస్తారు. ఓపీలలో వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ సమయం చాలా ఇబ్బందిగా మారింది. కొంత మంది ఆసుపత్రికి వచ్చేలోపు ఓపీ సమయం ముగిసిపోతుంది. ఇంకొందరు వైద్యుల వద్ద చికిత్స చేయించుకుని వైద్యపరీక్షలకు వెళ్లి వచ్చేలోగా డాక్టర్లు ఓపీలో ఉండని పరిస్థితి. కొన్ని విభాగాల ఓపీ వారం తర్వాత, మరికొన్నింటికి వారంలో రెండుసార్లు మాత్రమే ఓపీ ఉంటుంది. వైద్యపరీక్షలు చేయించుకున్న వారు తిరిగి ఆ రోజున వచ్చి చికిత్స చేయించుకోవాల్సి వచ్చేది. దీనివల్ల వ్యాధి ముదరడంతో పాటు చికిత్స అందక రోగి మరింత ఇబ్బంది పడాల్సి వచ్చేది. దీంతో కొంత మంది రోగులు ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకునేవారు. ఈ ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ఏ రోజు వచ్చిన రోగి అదే రోజే చికిత్స చేయించుకుని వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉదయం ఓపీతో పాటు సాయంత్రం ఓపీ కూడా ప్రారంభించారు. రెండు రోజులుగా సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు సైతం వైద్యులు ఓపీలో ఉండి రోగులకు చికిత్స చేస్తున్నారు.



ఓపీ విభాగాల్లో రోగులకు చికిత్స అందిసున్న వైద్యులు

రోజూ 2,500 మందికి పైగా చికిత్స

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, రాయచోటి, వైఎస్ఆర్, ప్రకాశం, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలు జిల్లాల రోగులు చికిత్స కోసం వచ్చేవారు. ఈ మేరకు ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య సోమ, మంగళ, బుధవారాల్లో 2,500 నుంచి 3వేల వరకు, ఇతర రోజుల్లో 2,200 నుంచి 2,500 వరకు చికిత్స కోసం వస్తున్నారు. వీరితో పాటు వారి వెంట సహాయకులు కూడా వస్తుండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేలాది మందితో ఆసుపత్రి ఆవరణ కిటకిటలాడుతోంది. వీరితో పాటు నిత్యం 1,200 నుంచి 1500 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చికిత్స అందుకుంటున్నారు. న్యూరోసర్జరీ, మెడికల్, కాలిన రోగుల వార్డు, సర్జికల్ వార్డుల్లో కొందరు ఒక్కోసారి నెలరోజుల పాటు ఉండి చికిత్స అందుకోవాల్సి వస్తోంది. ఇక్కడి వైద్యులపై నమ్మకంతో వందల కిలోమీటర్ల దూరం నుంచి రోగులు ప్రయాస అనుకోకుండా వైద్యం కోసం వస్తున్నారు.

ఫలితాల ఆధారంగా సూపర్‌స్పెషాలిటీలోనూ అమలు



ఆసుపత్రికి వచ్చిన రోగి సాయంత్రం వరకు ఉండి పూర్తిస్థాయిలో చికిత్స పొందే వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గతంలో కొన్నిసార్లు మళ్లీ రావాల్సి వచ్చేది. ఈ మేరకు సాయంత్రం వేళల్లో ప్రతి ఒక్క ఓపీలోనూ వైద్యులు ఉండాలని ఆదేశాలు జారీ చేశాం. దీనివల్ల ఒకేరోజు ఓపీ చికిత్స, వైద్యపరీక్షలు, చికిత్స అందే అవకాశం ఉంది. ముందుగా అన్ని రకాల స్పెషాలిటీలలో ప్రారంభించాం. మెరుగైన ఫలితాలు వస్తే సూపర్‌స్పెషాలిటీల్లో కూడా ఈ సేవలు అందిస్తాం. – డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

న్యూస్‌రీల్

మల్లన్న సేవలో స్పీకర్ తమ్మినేని



ఆలయ ప్రాంగణంలో స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

శ్రీశైలం టెంపుల్: రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద అధికారులు ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

జగనన్న 'ఆణిముత్యాలకు' ప్రోత్సాహకాలు

- ఉమ్మడి జిల్లాలో 49 మంది జిల్లా స్థాయికి ఎంపిక

కర్నూలు(సిటీ): 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్ల నిర్వహణలో నడుస్తున్న పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రతిభా విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో 49 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అవార్డుల ప్రదాన వేడుకలను ఈనెల 25న నియోజకవర్గం, 27న జిల్లా, 31న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు ఆదివారం జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎప్పుడూ కూడా లేని విధంగా ప్రతిభా విద్యార్థులను ప్రోత్సహిస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థాయిల్లోనూ విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇవ్వనుంది. సంబంధిత పాఠశాలకు మొమెంటోతో పాటు ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం సత్కరించనున్నారు.

పట్టణాన్ని పోస్టర్ ఫ్రీగా తీర్చిదిద్దుదాం



పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నంద్యాల(సిటీ): పట్టణాన్ని పోస్టర్ ఫ్రీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పోస్టర్లను మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేకుండా పట్టణంలో ఎవరైనా కరపత్రాలు, వాల్ పోస్టర్లు, నిషేధిత ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే నిబంధనలు అతిక్రమించిన పలువురికి జరిమానా విధించామన్నారు.

శ్రీ మఠంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం సెలవు రోజు కావడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్రనదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతులిచ్చారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, బంగారు, నవరత్న రథాలపై కొలువుంచి శ్రీ మఠంలో ఊరేగించారు.

శ్రీగిరి క్షేత్రం కిటకిట



క్యూ కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో క్షేత్ర పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించుకోవడానికి తరలి రావడంతో పాతాళగంగ స్నానఘట్టాలు కిక్కిరిసి కనిపించాయి. పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు కిటకిటలాడాయి. ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని అందజేశారు. మల్లన్న దర్శన అనంతరం భక్తులు క్షేత్ర పరిధిలోని సందర్శనీయ స్థలాలను సందర్శించి, వాటి విశిష్టతను తెలుసుకున్నారు.

సర్కిల్ కార్యాలయం నూతన భవనం ప్రారంభం



సర్కిల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డోన్ డీఎస్పీ

ప్యాపిలి: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ నూతన భవనాన్ని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని సీఐ శ్రీరాములు ప్రత్యేక చొరవ తీసుకుని నూతనంగా నిర్మించారు. కొత్తభవనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ పూజా కార్యక్రమాల్లో పాల్గొని నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీరాములును డీఎస్పీ అభినందించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూనే శాంతి భద్రతలు అదుపు తప్పకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బేతంచెర్ల సీఐ ప్రియతం రెడ్డి, ప్యాపిలి సీఐ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కేసుల 420 బీసీ

- అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు
- లోకేశ్ ఆరోపణలు నిరాధారం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బీసీ అవినీతిపై పత్రికల్లో వచ్చిన కథనాలను చూపిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తల నుంచే కమీషన్లు దండుకున్న ఘనత మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఎన్నికల అఫిడవిట్‌లో బీసీ పేరు మీద హైదరాబాద్‌లో 22 కబ్జా కేసులు చూపించి 420గా పేరుగాంచారన్నారు. నీరు చెట్టు పనులు చేయకుండానే కోట్లాది రూపాయాలు స్వాహా చేశారన్నారు. అదే సమయంలో కార్యకర్తలకు రావాల్సిన రూ.30 కోట్ల బిల్లులను కూడా మింగేసిన చరిత్ర బీసీదని విమర్శించారు. పేదలకు ఇళ్ల పట్టాలు రాకుండా కోర్టుకెళ్లి అడ్డుకున్న బీసీని ప్రజలు క్షమించరన్నారు. అభివృద్ధిని ఓర్వలేకనే అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై పత్రికల్లో వచ్చిన కథనాలను చూపిస్తూ వాటిని మీడియాకు వివరించారు.

➡ బనగానపల్లె పట్టణంలో బీసీ తన తండ్రి బీసీ గుర్రెడ్డి పేరున ఉన్న సుమారు ఏడు ఎకరాల కాలనీలో ప్రభుత్వ నిధులతో రహదారులు డ్రైనేజీ తాగునీటి వసతి కల్పించడం జరిగిందన్నారు. దీనిని ఎన్నికల అఫిడవిట్‌లో వ్యవసాయ భూమిగా చూపించడం విడ్డూరంగా ఉందన్నారు.

➡ పట్టణంలో బీసీ నివాసం జుర్రేరు వాగు పక్కన, లోకేష్ ఇల్లు తాడేపల్లిలో కృష్ణానది ఒడ్డున ఉన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.

➡ బీసీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.3 కోట్ల బనగానపల్లె గ్రామ పంచాయతీ నిధులు స్వాహా కాగా, డీపీఓ పార్వతి ఉద్యోగం కోల్పోయి సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించారన్నారు.

➡ ఎలాంటి అనుమతులు లేకుండానే బీసీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అక్రమంగా రవ్వలకొండపై మైనింగ్ పనులు జరిగాయన్నారు.

➡ జీఎస్ఎస్ఎస్‌కు చెందిన సుమారు రూ. 60 కోట్ల విలువైన మెటీరియల్‌ను ప్రభుత్వానికి ఎలాంటి రాయితీ చెల్లించకుండా అధికారులను బెదిరించి బీసీ దోచుకున్నారని ఆరోపించారు.

➡ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని, నంద్యాలలో లక్ష్మీదేవి అనే మహిళను తాను బెదిరించలేదని, డబ్బులు ఇచ్చి ఆదుకున్నామని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు.

➡ టీడీపీ హయాంలో బనగానపల్లె రింగ్ రోడ్డుకు నిధులు మంజూరు కాకపోయినా బీసీ హడావుడిగా శంకుస్థాపన చేసి ప్రజలను మభ్య పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు.

➡ ఐదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న బీసీ ముస్లింల కోసం ఎందుకు షాదీఖానా పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో షాదీఖానా నిర్మాణానికి రూ.1.30 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

➡ పట్టణంలో వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.4.20 కోట్ల నిధులు టీటీడీ ద్వారా మంజూరు కాగా విరాళాల రూపంలో మరికొంత మొత్తం వసూలైందన్నారు. తాను కూడా ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు ఇచ్చామన్నారు.

➡ ఏపీ ట్రాన్స్‌కో ఆపరేటర్ల పోస్టులకు తాను డబ్బులు తీసుకున్నానని లోకేష్ ఆరోపణలు చేశారని కానీ.. 2015 ఫిబ్రవరి 3న కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తికి చెందిన నాగరాజుకు ఆపరేటర్ పోస్టు ఇస్తామని చెప్పి అప్పటి ఎమ్మెల్యే బీసీ రూ.10 లక్షలు తీసుకొని మోసం చేయడంతో నాగరాజు ఆత్మహత్య చేసుకున్న విషయం లోకేశ్ తెలుసుకోవాలన్నారు.

➡ సమావేశంలో జెడ్పీ వైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ నేతలు కాటసాని ఓబులరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ సుబ్బమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండా.. వాన

- మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- సాయంత్రం వానతో కొంత ఉపశమనం
- డోన్‌లో పది కిలోల బరువైన వడగండ్లు
- గాలివానకు నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు



కురుకుందలో వడగండ్ల వాన



అవుకు పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం


కర్నూలు(అగ్రికల్చర్): వేసవి సెగలు కర్నూలు, నంద్యాల జిల్లా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆదివారం కూడా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే నమోదయ్యాయి. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 12 గంటల సమయంలోనే 43.1 డిగ్రీలు, మంత్రాలయంలో 42.01 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలో ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో చాగలమర్రిలో 44.27, కొతాళం మండలం నదిచాగిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. పిడుగుపాటు సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

కొత్తపల్లి మండలం నందికుంట సమీప పొలంలో నిలిచిన వర్షపునీరు





డోన్ మండలం కొత్తకోట సమీపంలో పది కిలోల బరువైన వడగండ్లు పడిన దృశ్యం



పాములపాడు మండలం బానుముక్కల సమీపంలో గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం

➡ డోన్ మండలం కొత్తకోట గ్రామ ప్రాంతంలోని జాతీయ రహదారిపై పెద్ద పెద్ద వడగండ్లు పడ్డాయి. దాదాపు 10 కిలోలకుపైగా బరువుతో రెండు, మూడు వడగండ్లు పడ్డాయి. మిగిలిన వడగండ్ల చిన్నవే. బరువైన వడగండ్లు పడటంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

➡ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు చోట్ల గాలుల తీవ్రతకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

➡ కొత్తపల్లిలో నాగరాజుకు చెందిన ఎద్దు, ఎం.అగ్రహారం గ్రామంలో లక్ష్మన్న అనే రైతుకు చెందిన ఎద్దు పిడుగు శబ్దానికి బెదిరి మృతి చెందాయి.

➡ ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వడగండ్ల వాన కురిసింది. కొందరు ప్రజలు ఆసక్తిగా వాటిని సేకరించుకున్నారు.

➡ కల్లూరు తదితర మండలాల్లో కూడా తేలికపాటి వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గాలి ఎక్కువగా ఉండటంతో మామిడి తోటలు కొంత దెబ్బతిన్నాయి. కాయలు నేలరాలడంతో రైతులు నష్టపోయారు. అకాల వర్షాలు పడుతుండటంతో రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పేందుకు ఇబ్బందులు పడ్డారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఉత్తర్వులు

మహానంది: వక్ఫ్ బోర్డుకు చెందిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ పేరుతో కొందరు నకిలీ ఉత్తర్వులు సృష్టించారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య నుంచి సమాచారం అందడంతో ఆదివారం ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు మహానంది తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు. బొల్లవరం గ్రామంలో 486–2 సర్వే నెంబర్‌లో 2.86 ఎకరాల విస్తీర్ణంలో వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయి. వీటిని కబ్జా చేసేందుకు నిషేధిత జాబితా నుంచి ఆ భూములు తొలగించినట్లు కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఇలా ఎవరు చేశారో తెలియదు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

క్లుప్తంగా

బాలికలకు ఉచితంగా నర్సింగ్ విద్య

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ తదితర పేద వర్గాలకు చెందిన బాలికలకు ఉచితంగా నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక క్రిష్ణానగర్‌లోని సొసైటీ ఫర్ హోలీ పవర్ ఆధ్వర్యంలో ఈ కళాశాల కొనసాగుతుందన్నారు. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో ప్రవేశం పొందిన వారికి ఉచిత, భోజన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన బాలికలు దరఖాస్తు వివరాలకు సెల్: 9603168772, 9848352725 నంబర్లను సంప్రదించాలన్నారు.

తుగ్గలిలో చోరీ

తుగ్గలి: మండల కేంద్రం తుగ్గలిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు కథనం మేరకు..గ్రామానికి చెందిన కాశమ్మ కదిరప్ప దంపతులు చందోలిలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లగా, కొడుకు, కోడలు రాత్రి గొర్రెల మంద వద్ద కాపలాకు వెళ్లారు. ఇదే అదునుగా గుర్తు తెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 2తులాల బంగారం, రూ.50 వేలు ఎత్తుకెళ్లారు. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున ఆదివారం విలేకరులకు తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



కుక్కకాటుకు గురైన చిన్నారులు

చాగలమర్రి: మండలంలోని గోడిగనూరు గ్రామంలో కుక్కలు దాడి చేసిన ఘటనలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా కొర్రపాడు గ్రామానికి చెందిన రామ్మోహన్ తన కుమార్తె హిమజాతో కలిసి ద్విచక్రవాహనంలో క్రిష్ణాపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యమంలో గొడిగనూరు గ్రామంలో వారి ద్విచక్రవాహనాన్ని కుక్కలు వెంబడించి దాడిచేశాయి. ఈ ఘటనలో చిన్నారి హిమజ కాలికి తీవ్ర గాయమైంది.అలాగే చాగలమర్రికి చెందిన బాలుడు యూసూఫ్ ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఇద్దరు చిన్నారులు చాగలమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు.

కుందూనదిలో పడి మహిళ మృతి



ప్రమీలమ్మ(ఫైల్)

దొర్నిపాడు: క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ప్రమీలమ్మ (55) అనే మహిళ ఆదివారం కుందూనదిలో పడి మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు.. మృతురాలు రోజులాగే గేదెలనే మేపుకునేందుకు పొలానికి వెళ్లింది. తిరిగి వచ్చే సమయంలో గేదెలు గ్రామంలోని కుందూనదిలో కాసేపు సేదతీరి ఇంటి ముఖం పడుతాయి. ఎంతసేపటికీ నీటిలో నుంచి గేదెలు ఒడ్డుకు రాకపోవడంతో నదిలోకి దిగి మందలించబోయింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న లోతు గుంతను గమనించకపోవడంతో అందులో మునిగిపోయింది. తోటి మహిళ గమనించి రక్షించమని గట్టిగా కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గుంతలో పూడిక ఉండటంతో అందులో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి భర్త రామక్రిష్ణారెడ్డి, కొడుకు శివరామిరెడ్డి ఉన్నారు.

దిగొచ్చిన వంట నూనె!

- స్టాంప్ డ్యూటీ తగ్గింపుతో అందుబాటులో ఆయిల్ ధరలు
- వ్యాపారులు కుమ్మక్కై రేటు పెంచకుండా చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పామాయిల్ లీటర్ రూ.99
- సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.118



కర్నూలు(సెంట్రల్): మొన్నటి వరకు ఆకాశన్నంటిన వంట నూనెల ధరలు ఇప్పుడు దిగొస్తున్నాయి. ఆరు నెలల క్రితం రూ.200 వరకు పలికిన లీటర్ నూనె ధర ప్రస్తుతం 120 దిగువకు చేరింది. వంట నూనెల్లో సన్ ఫ్లవర్, సోయాబిన్, పామాయిల్ ధరలు బాగా తగ్గడంతో సామాన్యులకు భారీ ఊరట లభిస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో తగ్గుముఖం

కరోనా కంటే ముందు నుంచే వంట నూనెల ధరలు పెరగడం మొదలయ్యాయి. ఒకప్పుడు ఏ ఆయిల్ తీసుకున్న లీటర్ నూనె రూ. 100 లోపే ఉండేది. అయితే, కరోనా సమయంలో వంట నూనెల ధరలు బాగా పెరిగాయి. ఆ సమయంలో పామాయిల్ ధరలు లీటర్ రూ.170కి చేరుకున్నాయి. సన్ ఫ్లవర్, సోయాబిన్ లీటర్ నూనెలు రూ.180కి చేరువయ్యాయి. ఇంతలోనే ఉక్రెయిన్, రష్యా యుద్ధం మొదలు కావడంతో వంట నూనెలు ధరలు ఆకాశన్నంటాయి. ఒక దశలో రూ. 200మార్క్‌ను దాటాయి. దీంతో ఆ సమయంలో పేదలకు వంట నూనె కొనుగోలు తీవ్ర భారంగా మారింది. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని గతేడాది ఒకసారి, ఈ యేడాదిలో ఇటీవలే మరోసారి తగ్గించింది. దీనికి తోడు అంతర్జాతీయంగా నూనెల ధరలు తగ్గడం మొదలు కావడంతో దేశంలో ధరలు అదుపులోకి వచ్చాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ రేట్లు పెరగకుండా తరచూ మిల్లుల్లో తనిఖీలు చేయడం, కల్తీలు లేకుండా చర్యలు తీసుకోవడంతో నూనెల ధరలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం పామాయిల్ లీటర్ ధర రూ.99 కాగా, సన్ ఫ్లవర్, సోయాబిన్ ధర రూ.118–120 మధ్య ఉంది. వేరుశనగ నూనె మాత్రం ఇంకా తగ్గలేదు. మార్కెట్‌లో లీటర్ రూ. 173 వరకు ధర పలుకుతోంది.

సన్ ఫ్లవర్ ఆయిల్ వినియోగమే అధికం..

జిల్లాలో అధికంగా సన్ ఫ్లవర్ ఆయిల్ వినియోగమే ఉంటుంది. రోజుకు 100 మిలియన్ టన్నుల ఆయిల్ వాడకం ఉంటోంది. ఇందులో 60 శాతం వరకు సన్ ఫ్లవర్ ఆయిలే ఉంటుంది. మిగిలిన దానిలో 20 శాతం పామాయిల్, మరో 20 శాతం వేరుశనగ నూనెను ప్రజలు వినియోగిస్తున్నారు. అత్యధిక మంది ఉపయోగించే సన్ ఫ్లవర్, పామాయిల్ ధరలు బాగా తగ్గడం ఊరట కలిగించే విషయం.

పామాయిల్ ధర రూ.170 ఉండేది



కరోనా, ఉక్రెయిన్ యుద్ధం తరువాత ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా లీటర్ నూనె ధర రూ.170కి చేరింది. అయితే, ఆరునెలల నుంచి రేట్లు తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ రూ.100గా ఉంది. ఆరు నెలలతో పోల్చుకుంటే రూ.70 వరకు ధర తగ్గింది.

– మితేష్, అంబికా ఆయిల్స్,కర్నూలు

లీటర్‌పై 70-80 రూపాయలు తగ్గింది



ఆరు నెలల నుంచి ఆయిల్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. లేకపోతే అంతకు ముందు ఏ ఆయిల్ కొనాలన్నా రూ.200కు పైనే రేటు ఉండేది. దిక్కుతోచేది కాదు. నిత్యవసరాల ధరల్లో ఆయిల్‌కే ఎక్కువగా ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం వేరుశనగ మినహా అన్ని రకాల వంటనూనెల ధరలు తగ్గాయి. గతంతో పోల్చుకుంటే లీటర్‌పై రూ.70–80 తగ్గింది.

–రాబియా, కర్నూలు

వ్యాపారులు రేట్లు పెంచకుండా చర్యలు



ఆయిల్ రేట్లు బాగా తగ్గాయి. ఒకప్పుడు లీటర్ నూనె రూ.200 దాటింది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో రేట్లు బాగా తగ్గుతూ వస్తున్నాయి. వ్యాపారులు రేట్లు పెంచకుండా ఆయిల్ మిల్లుల్లో తరచూ తనిఖీలు చేస్తున్నాం. కల్తీలు కాకుండా చూస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు

ప్రజారోగ్యానికి సీఎం ప్రాధాన్యత



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ తదితరులు

- విశ్వభారతి గ్రూప్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కాంతారెడ్డి
- డోన్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహణ



మాట్లాడుతున్న డాక్టర్ కాంతారెడ్డి

డోన్: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని విశ్వభారతి గ్రూప్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కాంతారెడ్డి, ప్రముఖ ప్రభుత్వ వైద్యులు రవికళాధర్ రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో విశ్వభారతి వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంయుక్తంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించాయి. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లతో కలిసి డాక్టర్ కాంతారెడ్డి, డాక్టర్ రవికళాధర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం 24, 25, 26వ తేదీల్లో అవసరమైన వారికి ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. రోగులతో పాటు వారి సహాయకులకు ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తామన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

క్యాంప్‌నకు విశేష స్పందన

మెడికల్ క్యాంపునకు మొదటిరోజు విశేష స్పందన లభించింది. దాదాపు 1200 మంది రోగులు ఓపీ తీసుకొని రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. గుండెజబ్బు కలవారికి ఈసీజీ, 2డీ ఎకో, స్కానింగ్ లాంటి పరీక్షలు నిర్వహించారు. రెండవ దశలో కూడా వివిధ రోగాల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి శిబిరంలో ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ క్యాంపులో 30 మంది ప్రభుత్వాసుపత్రి వైద్యులతో పాటు విశ్వభారతి హాస్పిటల్ వైద్యులు, మునిసిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, జాకీర్ హుస్సేన్, సచివాలయాల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు వెళ్తూ మృత్యువాత

- బైక్‌ను ఢీకొట్టిన బొలెరో వాహనం
- పగిడ్యాల రోడ్డులో ఘటన

నందికొట్కూరు: బొలెరో వాహనం బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఆదివారం ఓ యువకుడు దుర్మరణం చెందాడు. టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు పట్టణంలోని షరీఫ్ నగర్‌కు చెందిన సాయిరామ్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాఘవేంద్ర, చిన్న కుమారుడు మధు ఇద్దరు కలిసి పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో జరిగే మైసమ్మ జాతరకు బైక్‌పై కర్నూలు నుంచి బయల్దేరారు. తమ్ముడు బైక్ నడుపుతుండగా అన్న వెనుక కూర్చున్నాడు. పగిడ్యాల రోడ్డులో జీవన్‌జ్యోతి స్కూల్ సమీపంలో వెళ్తుండగా బొలెరో వాహనం వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాఘవేంద్రను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మధుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ విజయభాస్కర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

21 రోజుల్లో శ్రీరామకోటి



యువతిని అభినందిస్తున్న ఆవోపా నాయకులు

డోన్ టౌన్: పట్టణానికి చెందిన యువతి కొప్పరపు శ్రావణి కేవలం 21రోజుల్లో శ్రీరామ కోటి రాసి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. ఆవోపా ఆధ్వర్యంలో ఊరూరా శ్రీరామ లిఖితం పుస్తకాలు పంచారు. కొప్పరపు కృష్ణమూర్తి అలియాస్ యాంకర్ కిట్టు కుమార్తె శ్రావణికి శ్రీరామకోటి రాయడం అంటే ఇష్టం. దీంతో ఆ యువతి అతి తక్కువ సమయంలోనే రాసి డోన్ ఆవోపాకు సమర్పించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆ సంఘం నాయకులు మాకం కృష్ణ కిషోర్,జొన్నలగడ్డ శ్రీనివాసులు శ్రావణిని అభినందించారు.

విద్యుత్ పనులు వేగవంతం చేయండి



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు, గాలి వల్ల దెబ్బ తిన్న స్తంభాలు, ఇతర మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని పలు మండలాల్లో ఈదురు గాలులు, వర్షాల కారణంగా కొన్ని చోట్ల బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ వంటి సమస్యలు ఏర్పడ్డాయన్నారు. ఈ సమస్యలను నివారించి వెంటనే విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. ముఖ్యంగా స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి ఉంటే వాటిని మార్చాలని, అందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందని చెప్పారు. ఈ పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ శాఖకు రూ.65.66 లక్షల నష్టం

గత రెండు రోజులుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు భారీ నష్టం వాటిల్లిందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఈదురుగాలుల ప్రభావంతో మొత్తం 33కేవీ స్తంభాలు 37, 11 స్తంభాలు 85, ఎల్‌టీ స్తంభాలు 110 పడిపోవడంతో పాటు, 28 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని, వీటి వల్ల రూ.65.66 లక్షల నష్టం వచ్చిందన్నారు. ఈ నెలలో మొత్తం స్తంభాలు 426 స్తంభాలు విరిగిపోగా, 37 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రూ.1.03కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తనతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈఈలు, ఓ అండ్ ఎం ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించి పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని వెల్లడించారు.

ఎయిడ్స్‌రహిత ప్రపంచాన్ని చూద్దాం



కలెక్టరేట్ వద్ద క్యాండిల్ లైటింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్‌రహిత ప్రపంచాన్ని చూసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా మే మూడో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తారన్నారు. ప్రస్తుతం హెచ్‌ఐవీ బాధితులను సమాజంలో ఎలాంటి వివక్షత చూపకుండా సమానత్వం కలిప్పించాలని చెప్పారు. బలమైన సమాజం నిర్మించేందుకు హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, సంఘీభావం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శారద, హెచ్‌ఈఓ శివశంకర్‌రావు, నేస్తం ప్రాజెక్టు అధికారి సుధారాణి, ప్రోగ్రామ్ అధికారులు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రచనలు సామాజిక చైతన్యం తేవాలి



మాట్లాడుతున్న కరణం కిషోర్‌కుమార్

కర్నూలు కల్చరల్: సాహిత్య రచనలు సామాజిక చైతన్యానికి దోహదపడాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కర్నూలు అధ్యక్షుడు కరణం కిషోర్‌కుమార్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య రచనలు పెరగాలన్నారు. సమాజంలోని రుగ్మతలు రూపుమాపేందుకు ఉపయోగ పడాలన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జరిగిన సమ్మేళనంలో వివిధ ప్రాంతాలకు చెందిన కవులు కవిత్వం చదివి వినిపించారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు నజీమా కౌసర్, నరహరి నారాయణరెడ్డి మాట్లాడారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డి.కేశవయ్య, మహిళా కార్యదర్శి మశేకర్ నాగజ్యోతి, సభ్యులు సువర్ణజోషి, నాగోశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట భూములు పండ్ల తోటలకు అనుకూలం

- బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వెల్లడి



కంది పంటల సాగును పరిశీలిస్తున్న బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 70 నుంచి 75 శాతం వరకు వ్యవసాయం వర్షాధారంగానే జరుగుతోంది. జిల్లా సాధారణ వర్షపాతం 614 మిల్లీమీటర్లు. మెట్టసాగులో 65 శాతం ఎర్ర నేలలు, 35 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. తక్కువ వర్షపాతం, అది కూడా సకాలంలో కురవకపోవడంతో పంట నష్టం, తక్కువ దిగుబడులు వస్తున్నాయి. కొన్ని యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటిస్తే మెట్టసాగులో నష్టాలను అధిగమించవచ్చు. మెట్టసాగులో ఎలా రాణించవచ్చు. లాభాలను ఏ విధంగా పండించుకోవచ్చనే విషయాలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ(7702366115) తెలియజేశారు. వివరాలు శాస్త్రవేత్త మాటల్లోనే..

ఎర్ర నేలల యాజమాన్యం...

లోతు తక్కువగా ఉంటుంది. అందువల్ల నీటిని నిలుపుకునే సామర్థ్యం కూడా తక్కువ కావడంతో వర్షం ద్వారా లభించే నీరు ఒరవడి(రన్‌అప్) రూపంలో నష్టపోవడమే కాక సారవంతమైన మట్టిపై పొర కొట్టుకుపోతుంది. దీనిని నివారించడానికి వాలుకు అడ్డంగా సేద్యం చేయడం, కాంటూరు గట్లు ఏర్పాటు చేసుకోవాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నడం వల్ల, విత్తడం, అంతర కృషి చేయడం వల్ల నీటి ఒరవడిని ఎక్కడికక్కడ అరికట్టి ఎక్కువ నీరు భూమిలోకి ఇంకుతుంది. 2 శాతం వాలు కల్గిన నేలల్లో ప్రతి 50 మీటర్ల దూరానికి 0.63 ఘనపు మీటర్ల పరిమాణంలో కాంటూరు గట్లు వేయాలి. నేలపై పొర గట్టిపడే భూముల్లో ఎకరానికి 10–15 టన్నుల ఇసుకతో కలియదున్నాలి. ఇలాంటి నేలల్లో వేరుశనగ ఊడలు సులభంగా దిగి కాయలు బాగా ఊరుతాయి. వర్షపు నీరు బాగా భూమిలోనికి ఇంకిపోవడం వల్ల నీటి వృథా తగ్గుతుంది. వేరుశనగలో అంతర పంటగా వేసే కందితో పాటు నీటి ఒరవడిని అరికట్టే ఉలువ, అలసంద కలిపి విత్తితే మంచి ఫలితం ఉంటుంది.

నల్ల నేలల్లో..

నీటిని నిల్వ ఉంచుకునే శక్తి నల్ల నేలల్లో అధికం. వర్షపు నీరు త్వరగా ఇంకదు. అందువల్ల అధిక శాతం నీరు, మట్టి కొట్టుకుపోతుంది. ఈ నేలల్లో భూసంరక్షణ, దున్నడంలో సాంకేతిక పద్ధతులు అవలంబించాలి. ఎర్ర నేలలకు వేసే కాంటూరు గట్ల మాదిరే నల్ల నేలలకు గ్రేడెడ్ గట్లు వేయాలి. 0.80 ఘనపు మీటర్ల గ్రేడెడ్ గట్లు వేసుకోవాలి. గట్ల పైభాగాన 0.1–0.25 శాతం వాలుతో నీరు పోవడానికి కాలువ తీసి దీనిని పెద్ద కాలువతో కలిపి నేలకోత లేకుండా నీటిని బయటకు పోయేలా చూడాలి. వెడల్పాటి బోదెలు, కాల్వలుగా నేలను తయారు చేసి బోదెల పైన విత్తుకోవాలి. కాల్వలు ఎక్కువైన నీటిని బయటకు పంపడానికి ఉపయోగపడతాయి. మూడు మీటర్ల వెడల్పుతో 20 సెం.మీ ఎత్తు గల వెడల్పాటి బోదెలు చేసి విత్తుకుంటే మంచి దిగుబడులుంటాయి. ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువు వేస్తే నీరు బాగా ఇంకుతుంది.

వర్షపు నీటి యాజమాన్యం

మెట్ట ప్రాంతాల్లో 10 నుంచి 40 రోజుల వరకు పంట కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు. ఒక్కోసారి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల పొలం నుంచి నీరు పొంగి పొర్లుతుంది. ఈ నీటిని నీటిగుంటలో(ఫాంపాండ్) నిల్వ చేసి పైరు 10 రోజులకు మించి వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు స్ప్రింక్లర్ల ద్వారా గంటసేపు తడిపితే 20–30 శాతం దిగుబడి పెరుగుతుంది. నీటిగుంటలను(ఫాంపాండ్) 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతులో తవ్వుకోవాలి. నీటి గుంతల్లో నీరు నిల్వ ఉండటానికి ఆరు భాగాలు మట్టి, ఒక భాగం సిమెంట్ తగినంత నీటిని కలిపి గుంతలోపలి భాగం పూయాలి. దీనివల్ల గుంతలో నీరు 2 నెలల వరకు నిల్వ ఉంటుంది. వేరుశనగ, పత్తి, కంది, శెనగ, జొన్న తదితర పంటల్లో కీలక దశలో ఈ నీటిని వాడుకోవచ్చు. అనంత వేరుశనగ విత్తే పరికరంతో విత్తిన పొలాల్లో కలుపు నివారణకు ట్రాక్టర్‌తో నడిచే అంతర కృషి పరికరాన్ని వాడవచ్చు. దీంతో వరుసల మధ్య కలుపును సులభంగా నియంత్రించవచ్చు. హెక్టారు వేరుశెనగ పంటతో పాటు 10 గొర్రె పిల్లల్ని నాలుగు నెలలు పెంచితే అదనపు ఆదాయం ఉపాధి లభిస్తుంది.

మెట్ట భూములకు అనువైన పండ్ల తోటలు

తక్కువ నీటితో ఫలసాయాన్ని ఇచ్చే రేగు, సీతాఫలం, మామిడి, సపోటలను మెట్ట పంటలుగా పెట్టవచ్చు. సాగునీరు అందించే పరిస్థితుల్లో దానిమ్మ, సపోట, మామిడి పంటలను సాగు చేసి వాటిల్లో మూడేళ్ల వరకు అంతర పంటలు వేసి అధిక ఆదాయం పొందవచ్చు.

ఎరువుల యాజమాన్యం...

వేరుశెనగకు వేరుశెనగ+కంది అంతర పంటకు విత్తే ముందు ఎకరానికి 8 కిలోల నత్రజని, 16 కిలోల బాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి. జొన్న, సజ్జ, సజ్జ+కంది పంటలకు 16 కిలోల నత్రజని, బాస్వరంనిచ్చే ఎరువులు వేసుకోవాలి.

- ఉలువకు 4 కిలోల నత్రజని, 12 కిలోల బాస్వరం వేయాలి. భూసార పరీక్షలను అనుసరించి బాస్వరం, పొటాష్ ఎరువుల మోతాదును నిర్ధారించాలి.
- వేరుశనగకు భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వాడాలి. నేలలో లభ్యమయ్యే బాస్వరం ఎకరానికి 10 కంటే తక్కువగా ఉంటే 16 కిలోలు, 10 నుంచి 20 ఉంటే 8 కిలోల బాస్వరం వేయాలి.
- లభ్య పొటాష్ 60 కంటే తక్కువ ఉంటే 16 కిలోలు, 60–120 కిలోల మధ్య ఉంటే పొటాష్ 8 కిలోలు వేయాలి. 120 మించితే పొటాష్ వేయనవసరం లేదు.
- జింక్ లోపం ఉన్న నేలల్లో వేరుశనగ విత్తిన 35 రోజులకు, 45 రోజులకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.